ఆఖరి వీడ్కోలు

"స్వప్నా! దేవీబాగ్‌లో అయిదున్నరకు ఉంటాను"

ఈ మాట గాలిలో వదిలి జవాబు కోసం చూడకుండా స్కూటర్ మీద దూసుకుపోయాడతడు.

స్కూటర్ చప్పుడుతో వినిపించిన ఆమాట స్వప్నను విభ్రాంతిలో ముంచింది ఎవరైనా విన్నారేమోనని చుట్టూ కలియ జూసింది, బెదురు చూపులతో

స్టూడెంట్స్ గుంపులు గుంపులుగా ఇళ్ళకు వెళ్ళిపోతున్నారు టీచర్సు జంటలుగా మాట్లాడుకొంటూ నడుస్తున్నారు

రోజూ తనతో వచ్చే మధుర టీచర్ ఈ రోజు సెలవుపెట్టడంవల్ల తను బ్రతికిపోయింది గాని

అయినా ఇతడికి తన పేరు ఎలా తెలుసు?

తెలిసినా తనను దేవీబాగ్‌లో కలుసుకొమ్మనేంత ధైర్యం ఎలా కలిగింది?

స్వప్నకి కలిగిన విస్మయం అంతా ఇంతా కాదు

స్వప్నదీ అతడిదీ నెలరోజుల పరిచయం మాత్రమే అదీ చూపుల పరిచయం!

అవివాహిత అయిన పాతికేళ్ళ అందమైన యువతి స్వప్న హైస్కూల్ టీచరు రోజూ బడికి వచ్చేప్పుడు వెళ్ళేప్పుడు అతడు స్కూటర్‌మీద కనిపిస్తాడు ఎక్కడ ఉంటాడో ఏంజాబ్ చేస్తుంటాడో స్వప్నకు తెలియదు. తరచు తెల్లటి డ్రెస్ వేస్తాడు ఒక విధమైన ప్రత్యేకతతో కనిపిస్తాడు.

చాలామంది, ముఖ్యంగా స్వప్నలాంటి ఆడపిల్లలు అతడిని చూస్తే అతడు స్వప్నని మాత్రమే చూస్తాడు.

మొన్న అతడు స్వప్నని చూసి నవ్వాడు పలుకరింపుగా

తనూ నవ్వింది స్వప్న, జవాబుగా.

ఆ నవ్వు దేవీబాగ్‌కు ఆహ్వానించేంత చనువు ఇచ్చిందా?

ఛ ఛ! తను చాలా తప్పు చేసింది. రేపటినుండి అతిడికేసి చూడకూడదు. తన చూపుల కథ ఇక్కడితో ఆపేయాలి

ఇల్లు చేరింది స్వప్న

ముఖం కడుక్కుని తల్లి ఇచ్చిన టీ తాగి తన గదిలో కుర్చీలో కూర్చొంది. టేబిల్‌మీద గడియారంలో ముళ్ళు కదులుతున్నాయి, కాలాన్ని మింగేస్తూ.

పోల్కంపల్లి శాంతాదేవి

స్వప్న చూపులు గడియారం మీదే ఉన్నాయి!

అయిదూ ముప్పై నిమిషాలు!

అతడు తన కోసం దేవీబాగ్‌లో ఎదురుచూస్తుంటాడా?

ఆ ఊహ స్వప్న మనసును తీయటి అనుభూతితో వణికించింది

ఉహుఁ, అతడెవరో? ఎక్కడివాడో?

అతడితో తన కథ సాగకూడదనిది!

ఈ కథకి ఇంకా రూపమంటూ ఏర్పడని ఈకథకి ఫుల్‌స్టాప్ పెట్టెయ్యాలి! రేపు అతడు కనిపించినప్పుడు 'రాలేదేం' అని తనని నిలదీసి అడుగుతాడేమో? ఇంకెప్పుడూ ఇలాంటి పిచ్చివేషాలు వేయొద్దని ఖచ్చితంగా చెప్పెయ్యాలి!

ఆలోచనల మధ్య స్వప్న గుండెలో సన్నని వేదన సుళ్ళు తిరిగసాగింది.

తొలి చూపులోనే తన గుండెలో ముద్రపడిన అతడి రూపాన్ని చెరిపి వేసుకోగలదా? ఆ చెరపడంలో తన గుండెలో ఎంత లోతైనగాయం ఏర్పడు తూంది! తన ఊహలలోకి, కలలలోకి కమ్మని పరిమళంలా చొచ్చుకువచ్చే అతని తలపును అటకాయించగలదా?

అటకాయించాలి!

లేకపోతే ఉపద్రవం జరిగిపోతుంది. తను చాలా సమస్యల్ని ఎదుర్కోవలసి వస్తుంది!

మరునాడు ఉదయం బడికి వెడుతూ తలవంచుకొని నడవసాపింది స్వప్న బడి ఇంకొక పదిగజాల దూరంలో ఉంది

నెల రోజులుగా పరిచితమైన స్కూటర్ శబ్దం వినిపించి స్వప్నగుండె దడదడలాడించింది కాని తలెత్తలేదు. ఇంకా వడివడిగా నడవసాగింది

స్కూటర్ స్వప్నకి డాష్ ఇచ్చేంత దగ్గరగా వచ్చి ఆగింది

"ఏయ్, మొద్దూ!" ప్రేమ ఉట్టిపడే గొంతుతో పిలిచాడతడు అతడి గొంతులో ప్రవహిస్తున్న చనువు ఈరోజే పలకరిస్తున్నట్టుగా లేదు ఎన్నో రోజుల పరిచయమున్నట్టుగా ఉహుఁ! ఎన్నో జన్మల పరిచయమున్నట్టుగా

అతిసమీపంగా ఉన్న అతడి ముఖం లోకి చూడకుండా ఉండలేకపోయింది స్వప్న

దూరానికి అందంగా కనిపించే ముఖాలెన్నో దగ్గరైతే ఉన్న వికృతాలు బయటపడుతుంటాయి చాలామంది విషయంలో. ఇతడిని దగ్గరినుండి చూస్తే దూరానికి కవిపించని అందాలు కనిపిస్తు న్నాయి! అందమైనవాడు, మగసిరి కలవాడు అని చెప్పడానికి ఏమేం ఉండాలో అన్నీ ఉన్నవాడు అనిపించింది స్వప్నకు

"దేవీబాగ్‌కు వస్తావేమో, ఎన్నో ఎన్నెన్నో మాట్లాడాలనుకొన్నాను. ప్చ్! నీ పిరికితనం మంచి ఛాన్స్ పోగొట్టింది! కనీసం ఈ లేఖయినా చదువుతావుకదూ!"

అతడి మాటల్లోని మృదుత్వం, అభ్యర్థన స్వప్న చెయ్యి ముందుకు వెళ్ళేలా, అతడి చేతినుండి కవరు అందు కొనేలా చేసింది! అది పర్సులో పెట్టుకొని బడికెళ్ళిం అయిపోతుందన్నట్టుగా గబ గబా నడవసాగింది.

ప్రార్థనలో నిలబడిందేగాని మనస్సు అంతా కవరుమీదే ఉంది. ఇంటర్వెల్ వరకు మనసు ఎలాగో బిగబట్టుకొని తరువాత కవరు చించింది. గులాబీరంగు కాగితం మీద వెల్వెట్ ఇంకుతో వ్రాసిన అక్షరాలు ముద్దొస్తూ, కునేగా సెంటు వాసన హాయిగా చుట్టుముట్టి మరో లోకం లోకి తీసికెళ్ళింది! ఆత్రుతగా కాగితం మీద పరుగులు తీసాయి చూపులు.

"డియర్ స్వప్నా!

నిన్న దేవీబాగ్‌లో నీకోసం చీకటి పడేదాకా ఎదురుచూశాను. రాలేదెందుకు? నేనంటే ఇష్టం లేదా? ఆ మాట ఆత్మ వంచన కదూ? ఇష్టంలేనిదే నా కళ్ళలో కళ్ళు కలిపేదానివి కాదు!

మరెందుకు రాలేదు?

నన్ను కలుసుకోవాలనీ, నాతో మాట్లాడాలనీ, నన్ను గురించి తెలుసు కోవాలనీ లేదా? ఉన్నా 'ఆడపిల్ల' నన్న జంకుతో వెనుకంజా? అంత జంకున్నదానివైతే నన్ను నీ చూపులతో ఎందుకు ప్రోత్సాహపరిచావు?

నీ గురించి నాకు తెలుసు. (ఎలా తెలుసునని ఆశ్చర్యపడబోకు. బడిలో పనిచేసె పంతులమ్మ వివరాలు సెకరించా లంటే పెద్ద కష్టమైన పని కాదు!)

నా గురించి నీకు చెబుతాను.

బి.ఇ. పూర్తిచేసి రెండు సంవత్సరా లైంది. ఈ సంవత్సరం ఇంటర్వ్యూలో సెలెక్ట్‌అయి ఈ ఊరికి జూనియర్ ఇంజనీరుగా వచ్చాను, నెలరోజుల క్రిందటే. వచ్చిన మరు రోజే నువ్వు కనిపించావు. (ఈ ఊళ్ళో ఇంతమంది ఉండగా నే నొక్కదాన్నే కనిపించానా అని నవ్వకు! ప్రేమ ఉదయించినచోట తప్ప మిగతాదంతా శూన్యమైపోతుం దనుకుంటాను మనిషికి!)

.... అంతా ఇందులోనే చెప్పేస్తే మనం దేవీబాగ్‌లో కలుసుకొంటే మాట్లాడుకోవడానికి మిగలొద్దా?

ఈరోజు అయిదున్నరకు దేవీబాగ్‌కు తప్పక వస్తావు కదూ?

రాకపోయావో నీకూ నాకూ చెల్లు!

ఇప్పటికి ఉంటా మరి. నీవాడి నని పించుకోవాలని ఆశతో నిరీక్షించే —

స్వరూప్.'

"స్వరూప్!" లేఖని ముద్దుపెట్టు కొంది స్వప్న. అందమైన పేరు! అంద మైనవాడు! జూనియర్ ఇంజనీరుగా జాబ్ చేస్తున్నవాడు! స్కూటర్ మీద తిరుగుతాడు. ఒక అంతస్తు కలవాడే అయివుంటాడు. అతడు తమ కులస్తుడే అయితే అమ్మానాన్న సమస్య న సులువుగా తీర్చింది అవుతుంది!

నీకూ, నాకూ కుదరదని చెప్పేస్తుంది.

ప్రేమకంటే ముందు పెళ్ళి గురించి ఆలోచించసాగింది స్వప్న. పెళ్ళివరకూ దారితీయని ప్రేమ ఎంత నరకంగా తయారవుతుందో, అది ఎన్ని సమస్యలను సృష్టిస్తుందో ఊహించలేని పసిపిల్ల కాదు తను. పాతికేళ్ళ వడుచు. వయసు పొంగు తగ్గి ప్రశాంతంగా ఆలోచించుకోగల వయసు వచ్చేసింది.

"ఏమిటే, స్వప్నా అంత పరధ్యానం? ఎక్కడినుండి ఉత్తరం?"

మధుర టీచర్ భుజం తట్టేసరికి గతుక్కుమని కాగితం కంగారుగా మడతపెట్టి హేండ్‌బాగ్‌లో ఉంచేసింది. "నిన్న సెలవుపెట్టా వెందుకు?"

"అమ్మకి జ్వరం వచ్చింది. హాస్పిటల్‌కి తీసికెళ్ళాను."

అడిగిందేగాని జవాబు వినలేదు స్వప్న.

"ఏమిటే, ఈరోజు కొత్తగా కనిపిస్తున్నావు?" మధుర ఆశ్చర్యంగా అడిగింది.

"సాయంత్రం నాతో దేవీబాగ్ వస్తావా?"

"ఎందుకు?"

"తరువాత చెబుతాను. ముందు చెప్పు, వస్తావా? రావా?"

"అమ్మ ఇంకా లేచి తిరగడంలేదు. పని ఉంటుంది."

"ఈ ఒక్కరోజు ఎలాగో తీరిక చేసుకు రాలేవూ?"

ఊరవతల ఉన్న దేవీబాగ్ ఆ ఊరి రాజాగారిది. దేశం నలుమూలల నుండి తెప్పించి నాటిన రకరకాల మొక్కలతో అందంగా పెంచబడిన తోట అది. చాలా మంది షికారుగా వెడతారట. ఇంట్లో పోరెత్తినప్పుడు తనూ, స్వప్న దేవీబాగ్‌కు వెళ్ళడం అలవాటే అయినా ఈ రోజు స్వప్న ఆహ్వానంలో ఒక ప్రత్యేకత కనిపించసాగింది మధురకు. స్వప్న కళ్ళలోకి చూస్తూ అడిగింది, "అక్కడ ఎవరిని కలుసుకోవాలి?"

"వస్తే చూపెడతాను." స్వప్న కళ్ళు క్రిందికి వాలిపోయాయి.

"చెప్పకూడదా? ఈ ఊరేనా?"

"ఊహుఁ. ఈ ఊరు కాదు."

"మరి?"

"నాకు తెలియదు."

"ఎన్నాళ్ళబట్టి నడుస్తోంది కథ?"

"అబ్బ! ప్రశ్నలతో చంపుతున్నావు! ఇదిగో, నీ సందేహాలన్నింటికీ జవాబు!" బాగ్‌లోంచి స్వరూప్ వ్రాసిన జాబు తీసిచ్చింది స్వప్న.

మధుర చదివి దీర్ఘం తీసింది. "ఓహో! ఈ స్కూటర్‌వాలానా?"

"ఆడవాళ్ళని చూసేపని తప్ప మరో పని లేనట్టుంది అని తిట్టేదానివే .... అయనే!"

"నువ్వా చూస్తున్నావని తెలిస్తే తిట్టకపోయేదాన్ని!" మధుర నవ్వింది.

సాయంత్రం అయిదున్నరకి దేవీ బాగ్‌లో అడుగుపెడుతున్న స్వప్నకి గుండె దడదడ కొట్టుకుంది. కాళ్ళలో వణుకు పుట్టడం, అరచేతుల్లో చెమట పట్టడంలాంటి అవస్థలన్నీ అనుభవంలోకి రాసాగాయి. ఒక పక్కగా ఆపిన స్కూటర్ కంటబడ్డాక ఆమెలో వణుకు మరింత అధికమైంది. తనని తాను స్వాధీనంలోకి తెచ్చుకుంటూ స్వరూప్ కోసం ముందుకు నడవసాగింది.

"అదుగో, నీ కథానాయకుడు! వెళ్ళు. నేనిక్కడ కూర్చొని పుస్తకం చదువు కొంటాను." మధుర ఆగిపోయింది.

పచ్చికలో ఒరిగి ట్రాన్సిస్టరులో సంగీతం వింటున్నాడు స్వరూప్.

తడబడే అడుగులతో సమీపించింది స్వప్న. గొంతులో తీవ్రత తెచ్చుకొని అంది: "ఈ ఊరు ఆడపిల్లల కోసం వచ్చారా? జాబ్ కోసం వచ్చారా?"

స్వరూప్ లేచి సర్దుకుని కూర్చు న్నాడు. "వచ్చింది జాబ్ కోసమే. కాని ఆడపిల్ల దొరికింది." చిరునవ్వుతో అన్నాడు. "కూర్చో స్వప్నా!"

"ఈ తోట మీదే అయినట్టుగా మర్యాద చేస్తున్నారే!" దబాయించింది.

"తోట నాదికాకపోయినా వచ్చింది మాత్రం నా కోసమే కదా?" తొణ కుక్కుండా అన్నాడు.

"మీ సంగతేమిటో తెల్చుకోవాలనే వచ్చాను."

"తేల్చుకోవడమంటే యుద్ధమన్న మాట! ఓ. ఎస్. ఇష్టమైన ఆడపిల్లతో యుద్ధంచేయడమంటే నాకు చాలా సరదాగా ఉంటుంది!" ఉత్సాహంతో అన్నాడు.

"చూస్తే చూశాడులే అనుకొన్నాను. ఈ అలుసుతో ప్రేమలేఖలు వ్రాసే వరకు, తోటలకు ఆహ్వానించడం వరకు వచ్చారు!"

"తప్పు చేసినట్టయితే శిక్షకు సంసిద్ధు డిని! ఇదిగో, ఈ పూలకొమ్మతో కొట్టు!" తనెంత కోపం తెచ్చుకొని మాట్లాడినా కోపగించుకోకుండా తమాషాగా మాట్లాడుతున్న అతడికేసి రాగభరితమైన చూపులతో చూసింది స్వప్న.

"కూర్చో, స్వప్నా!"

స్వప్న కూర్చుంది. "చెప్పండి. నన్నెందుకు పిలిచారు?"

"నెల రోజులు మన కళ్ళు మాట్లాడు కోవాలనీ, ఇలా ఒకరి కళ్ళలోకి ఒకరం చూచుకొంటూ ఈ చెట్లచాటున ఏకాంతంగా గడపాలనీ...."

"గడిపితే ఏమొస్తుంది?"

"గడిపాక ఏమొస్తుందో నువ్వే చూస్తావు. నేను చెప్పడమెందుకు? తెలిసి అడుగు పెడితే ఏముంటుంది? తెలియ కుండా అడుగుపెడితే ఆ లోకం చాలా అద్భుతంగా ఉంటుంది.

"ఏ లోకం?"

"ప్రణయలోకం."

"అంత తెలియకుండా అడుగుపెట్టి అద్భుతాలు చూడాలనే కుతూహలం నాకేం లేదు. జీవితాన్ని అంత తెలివి తక్కువగా నడిపే పదాహారేళ్ళ వయసు కాదు నాది!"

"వయసు ఆలోచనా విధానాన్ని మార్చవచ్చు! ఆలోచనా శక్తిని పెంచవచ్చు. అంత వరకు ఒప్పుకొంటాను. కాని, ప్రేమ మనిషినే కాదు వయసుని కూడా తలక్రిందులు చేసివేస్తుంది. అలా తలక్రిందులు కానిదే నువ్వు నా కళ్ళలో కళ్ళు కలిపేదానివనుకోను. ఆడదాని ఆహ్వానం లేనిదే ఏ మగవాడూ ముందడుగు వేస్తాడనుకోకు, స్వప్నా! అంటే నాలాంటి సభ్యతకలవాడు!"

స్వప్న ముఖం ఎర్రబడింది, సూటిగా కొట్టిన ఈ దెబ్బకు! తను ఇతడితో చిలిపి కయ్యాలాడడానికి వచ్చిందా? అన్ని సంగతులూ అడిగి అనుకూలంగా ఉంటే పెళ్ళి సంగతి ఎత్తాలనీ....

అయినా అంత చటుక్కున నన్ను పెళ్ళాడతారా అని ఎలా అడుగుతుంది?

"ఆలోచనలో పడిపోయావేం, స్వప్నా?" సిగరెట్ కేస్ సైజులో ఉన్న ట్రాన్సిస్టరు చేతిలోకి తీసుకొని స్టేషన్ మారుస్తూ అడిగాడు.

"ఏం లేదు. మీ సంగతులు చెప్పండి వింటాను!"

"హైదరాబాద్ మా నేటివ్ మా నాన్నగారు ఎక్జిక్యూటివ్ ఇంజనీరు, ప్రస్తుతం సాగర్‌లో. అన్నయ్య ఫారిన్‌లో ఉన్నాడు, మెడిసిన్‌లో స్పెషలైజ్ చేస్తూ. చెల్లెలు ఐ.ఎ.ఎస్.కు ట్రై చేస్తోంది. ఇవీ నా వివరాలు. చాలా?"

కులం గురించి అడగాలని పెదవుల వరకూ వచ్చింది. కాని, సభ్యత అడ్డు పడింది. కులం గురించి అడగడం ఈ కాలంలో నాగరికత కాదు! అయినా ముఖం పట్టుకొని నీ కులమేమిటి అని ఎలా అడుగుతుంది?

"అందమైనవాళ్ళను చాలామందినే చూశాను. కాని, విసనకర్రల్లా ఇంత పొడుగాటి రెప్పలతో ఇంత పెద్దగా ఉన్న కళ్ళని ఈ ముఖంలోనే చూశాను. చూసిన మొదటి క్షణంలోనే అనిపించింది ఈ కళ్ళని నా స్వంతం చేసుకోవాలనీ.... ఈ కళ్ళలో కాపురముండాలనీ...."

"అందమైనవి కనిపించినప్పుడల్లా స్వంతం చేసుకోవాలనుకొంటూ పోతే..."

"జారుడు అవుతాడు. స్వప్నా, నేనలా కనిపిస్తున్నానా? నువ్వు నన్ను అలా అంచనా వేసుకొంటున్నావా?" దెబ్బ తిన్నట్టుగా అడిగాడు.

"పైకి సరదాగా కనిపించినా ఇతడు చాలా సెన్సిటివ్‌గా ఉన్నట్టున్నాడు," అనుకొన్న స్వప్న ఇక అతడిని నొప్పించే మాటలేవీ అనకూడ దనుకొంది.

"స్వప్నా చీకటిపడుతోంది బయల్దే

రుదాం" అంటూ మధుర కేక పెట్టే వరకు ఇద్దరిమధ్య చాలా సంగతులు దొర్లాయి.

రెండోసారి స్వరూప్ అహ్వానాన్ని తేలిగ్గానే అంగీకరించింది స్వప్న. ఆ తరువాత దారిలో కలుసుకొన్నప్పుడు కళ్ళ సంకేతాలిచ్చుకోవడం, దేవీబాగ్‌లో కలుసుకోవడం జరిగింది.

ఒకరోజు మధుర అడిగింది, "అతడి కులం తెలుసుకొన్నావా ?"

"సన్నిహితంగా మాట్లాడుకొంటు న్నాం. కులం గురించి అడిగే సందర్భం మటుకు రావడంలేదు; కాని, అతడి మాట తీరు, అలవాట్లు తక్కువ కుల మని అనుకోడానికి వీల్లేకుండా ఉన్నాయి।" అని చెప్పింది స్వప్న.

"అలా అని ఊరుకోకు. అడిగెయ్యి, ప్రేమ ముదిరి పాకాన పడకముందే। మీ వాళ్ళు నిప్పులు కడిగే అచార వంతులు। అతడు బ్రాహ్మడు కాకపోతే నీ పెళ్ళి అసాధ్యమైపోతుంది. మీ వాళ్ళు ఈ పెళ్ళికి అంగీకరించరు।"

సాగర్ వెళ్ళి నాలుగు రోజుల తరువాత ఆ రోజే వచ్చాడు స్వరూప్.

"స్వప్నా, నీ ఫోటో కావాలి. అమ్మ, చెల్లి పంపించమన్నారు," అని చెప్పాడు, దేవీబాగ్‌లో ఆ సాయంత్రం స్వప్నని కలుసుకొన్నప్పుడు.

"ఫోటో ఎందుకు ?"

"స్వరూప్ వలచిన అమ్మాయి ఎంత అందంగా ఉంటుందోనని। మన గురించి అంతా చెప్పేశాను, స్వప్నా। నాన్నకి కొంచెం కష్టం ఆశ ఉండబట్టి నస పెడుతున్నాడుగాని చివరికి ఒప్పుకోక చేసేది లేదు। అమ్మా చెల్లీ చాలా సంతోషించారు."

"మన పెళ్ళికి మీ వాళ్ళు అంగీకరిస్తే చాలా ?"

"మీ వాళ్ళ అంగీకారం కూడా తీసు కొందాం. నన్ను మీ ఇంటికి ఎప్పుడు రమ్మంటావు ?"

"సందర్భం చూసి నేనే చెబుతాను. కాని.... కాని ?...."

"నేనెప్పుడూ మిమ్మల్ని అడగలేదు. మావాళ్ళతో ఈ సంగతి చెప్పినప్పుడైనా ...." సంకోచంతో ఆగింది.

"అడుగు స్వప్నా ।"

"మీరు బ్రాహ్మలేనా ?"

"మిస్ స్వప్నా। బి. ఏ., బి.ఇడి. కి కులం పట్టింపు ఉంటుందని తెలియదు ।" దెబ్బతిన్నట్టుగా అన్నాడు.

"మా అమ్మా నాన్నా బి. ఏ. చదువు కోలేదు. మావాళ్ళ కిలాంటి వాటిలో చాలా పట్టింపులున్నాయి."

"చదువుకొన్నదానివి. సంపాదించు కొంటున్నదానివి. పెద్దవాళ్ళమూర్ఖత్వాన్ని ఎదిరించలేవా ?"

స్వప్న ముఖం కళావిహీనమైంది. "అయితే మీరు ...."

స్వరూప్ స్వప్న చెయి అందుకొని

ఆమె వేళ్ళతో తన వేళ్ళు పెనవేసి ఆమె కళ్ళలోకి విచలితంగా చూశాడు. "మొదటే చెప్పకపోవడం పొరపాటే. చదువుకొన్నదానివి! దానికింత ప్రాముఖ్యత నిస్తావనుకోలేదు. ఆదిలో మనుషులకు కులాలు లేవు. మనుషులంతా ఒకటే. మనిషిలో స్వార్థం వెర్రితలలు వేసి కుల విభజన జరిగింది. ఈనాడు మనం అణుయుగంలో ఉండి ఈ కుల తత్వాన్ని ఎదిరించలేకపోతే మన చదువు లెందుకు? విజ్ఞానమెందుకు?"

"ఈ చరిత్ర తిరగదోడడంవల్ల, ఉపన్యసించడంవల్ల వాళ్ళు మారరు. మన పెళ్ళికి మా వాళ్ళు అంగీకరించడం అసంభవం, స్వరూప్!"

"మన కులాలు కలవనంతమాత్రాన నువ్వు నాకు దూరమైపోతానా, స్వప్నా? వాళ్ళని కాదని నా దగ్గరికి వచ్చెయ్యలేవా?"

స్వరూప్ ఆర్ద్రస్వరానికి విచలితంగా చూసింది స్వప్న. "వచ్చేస్తాను స్వరూప్! వచ్చేయక చేసేదిలేదు! వెనుదిరిగి వెళ్ళలేనంత దూరం వచ్చేశాను నీతో!"

2

"పిల్ల ఎద్దులా ఎదిగిపోయిందని నా బాధ నాకుండగా పులిమీద పుట్రలా ఇరుగు పొరుగు సాధింపు లొకటి! పిల్ల సంపాదనకు మరిగి పెళ్ళిచెటాకు లేమీ అనుకోవడం లేనట్టుందేమిటమ్మా అని! ఏం మనుషులో? ఏ తల్లిదండ్రులైనా పిల్ల అత్తారిల్లు మెట్టి పిల్లా పాపలతో కలకలలాడుతోంటే చూడాలనుకొంటారు గాని సంపాదించిపెడితే చాలననుకొంటారా? ఆ వెంకమ్మ పొద్దున ఆ మాట అన్నప్పటి నుండి నా మనసు మరిగిపోతూంది. మీకు చీమ కుట్టినట్టయినా లేదు కదా?"

స్వప్న తల్లి కమలమ్మ భర్తను సాధించసాగింది ముక్కు చీదుతూ.

"ఆ గడియ రాకముందు మనం ఎన్ని ప్రయత్నాలు చేస్తే ఏం లాభమే?" విశ్వేశ్వరయ్య అన్నాడు వేదాంతిలా.

"మనం చేసే ప్రయత్నాలు చేస్తే దైవం అనుకూలపడతాడండీ!"

"అమ్మాయి పెళ్ళికని నేనేం కట్నం మూటగట్టి పెట్టలేదు. నాకొచ్చే బడి పంతులు జీతం పిల్లలకి బట్టాపొట్టా గడిపి చదువులు చెప్పించింది. వేలకు వేలు కట్నం గుమ్మరించి ఆడపిల్లల పెళ్ళిళ్ళు చేయాలంటే నావల్లకాదు. పిల్లఉద్యోగం చేస్తుందికదాని ఎవడైనా కట్నం లేకుండా చేసుకొంటాడా అంటే అదీ లేదు. అవ్వా కావాలి, బువ్వా కావాలి అన్నట్టుంటారు మగపిల్లాడివాళ్ళు!"

"మొన్న సుభద్రమ్మ వాళ్ళు వాళ్ళక్క కూతుర్ని మన పురుషోత్తానికి అడిగారు. పదివేల కట్నమిచ్చి లాంఛనాలవీ మరో పదివేలదాకా ముట్టజెప్పగల మన్నారు. పురుషోత్తంతో చెబితే వాడు ఊఁ అనడు. మీరోమాటు కదిపిచూడండి!" భర్తకి

సలహా ఇచ్చింది "పురుషోత్తానికి కుదిరితే ఆ కట్నంతీసి స్వప్న కివ్వొచ్చు!"

పీలుచూచుకొని కొడుకుని కదిపాడు విశ్వేశ్వరయ్య

"నేను సుజాతను చేసుకోవాలను కొంటున్నాను,నాన్నా! నా ఒక్కడి జీతం ఏ మూలకవుతుంది? ఇద్దరు సంపాదించే సంసారాలే కుంటినడక నడుస్తున్నాయి!" పురుషోత్తం తన మనసులో మాట బయటపెట్టాడు సుజాత ఈ ఊరు పిల్లే పైగా బంధుత్వం కూడా ఉంది!

"సుజాతను చేసుకొంటావా? వాళ్ళ దగ్గరేముందిరా ఇవ్వడానికి బొచ్చెతప్ప? ఎగిరాడు విశ్వేశ్వరయ్య

కట్నం తీసుకు రాలేకపోవచ్చు సుజాత కాని, బి ఏ చదివింది టైప్, షార్ట్‌హాండ్ నేరుస్తోంది అది పాసైతే స్టెనోగా ఉద్యోగం ఖాయం! ఉద్యోగం చేసేపిల్లయితే వేణ్ణీళ్ళకు చన్నీళ్ళనట్టుగా ఉంటుంది! మరోపిల్ల పదివేలో,పన్నెండు వేలో కట్నం తెస్తే మీకు మిగిలేదెంత? కట్నానికి తగ్గట్టు నగలూ, బట్టలూ పెట్టాలి పిల్లకు బంధువులకు పొట్టనిండా మేపి చీరసారెలు సమర్పించాలి! మనగుడుపు అయ్యేసరికి చేతిలో మిగిలేది పూజ్యం!"

"ఓహో! పెద్ద ప్లానేవేశావే! ఎంత స్వార్థపరుడివిరా! ఉద్యోగం చేసే పిల్లయితే కట్నం లేకుండా పెళ్ళి చేసుకొంటావు! కట్నంలేకుండా పెళ్ళాడిన అదర్శ యువకుడివన్న పేరుకొట్టేస్తావు పెళ్ళయిన మరురోజు మరో ఊరు ట్రాన్స్ఫర్ చేయించుకొని మీ కాపురం మీరు చూచుకొంటారు ఇద్దరు సంపాదించుకొంటున్నారు కదాని అవసరంపడి పదో పాతికో అడిగామనుకో 'మా ఖర్చులు మాకున్నాయి, నాన్నా!' అని జవాబిస్తావు! అంతేగా? పక్షి పిల్లల్లా రెక్కలొచ్చి ఎగిరిపోతే,రెక్కలుడిగాక అసరా అని కనిపెంచిన మా గతేం కావాలిరా?" అరవసాగాడు విశ్వేశ్వరయ్య

"కట్నం తెచ్చే పిల్లను చేసుకొన్నా మనకు మిగిలేదేముంటుంది, నాన్నా?" విసుగు వ్యక్తంచేశాడు పురుషోత్తం

"బట్టలూ నగలూ వాళ్ళనే తెచ్చుకొమ్మనాలి కట్నం కాష్‌గా మనచేతికిస్తే అది స్వప్నకివ్వొచ్చు! ఇద్దరి పెళ్ళి ఏ కొండమీదో చేస్తే నాలుగైదు వేలతో పోతుంది!"

"చెల్లెలికి కట్నం సంపాదించిపెట్టడానికే నన్ను కన్నావేమిటి?" చిటపట లాడాడు "కట్నంతెచ్చే కొడుకులేకపోతే నీ కూతురికి పెళ్ళిచేయవా?"

"వెధవా! కూతలునేర్చావురా! నువ్వు కట్నంలేకుండా ఆ సుజాతను చేసుకోవడమే జరిగితే నీ ముఖం మాకు చూపించకు! నువ్వసలు పుట్టలేదను కొంటాం లేదా చచ్చాడనుకొంటాం!

పురుషోత్తం చిటపటలమధ్య,

విశ్వేశ్వరయ్య చిందులమధ్య స్వప్న ప్రవేశించింది

"అన్నయ్యా! నువ్వు నా కోసం త్యాగం చేయాల్సిన అవసరంలేదు నువ్వు నా కోసం నీ మనసుకు నచ్చిన అమ్మాయికి, మనసు చెప్పిన దానికీ దూరం కానక్కరలేదు!

"నాన్నగారూ! నా పెళ్ళికోసం మీరు తలలు బద్దలుకొట్టుకో నక్కరలేదు వేలకు వేలు డబ్బు దోసిట్లో ఉంచుకొని వరుణ్ణి అన్వేషించడానికి నేనేం అంత వ్యక్తిత్వంలేని ఆడపిల్లని కాదు. నాకూ ఆదర్శాలున్నాయి. ఆలోచనలున్నాయి. ఇంత చదువుకొని, సంపాదిస్తూ కూడా

సెప్టెంబర్ నెల క్విజ్

సమాధానాలు

1 — ఎ   2 — ఎ   3 — డి

4 — సి   5 — డి

6. రాంటెజన్ 7. గురుముఖి 8. బాబర్ 9. ట్రిగ్వేలీ 10. అస్సాం

1. జి. మేరి, విశాఖపట్నం 2. ఎస్. వెంకటేశ్వరులు, కొల్లాపూర్ 3. కాసిన జగన్మోహన రావు, కాకినాడ 4. కె. శివకుమార్, తిరుపతి 5. ఎ. బి. శాస్త్రి, మచిలీపట్నం 6. బోయ పాటి రమేష్ బాబు, పెదకాకాని 7. నడింపల్లి వెంకట హనుమంతరావు, నర్సారావుపేట 8 తోలేటి లలిత, తెనాలి 9. తోలేటి రాంబాబు, తెనాలి 10. తోలేటి పతంజలి, తెనాలి 11. వంకమామిడి సరస్వతి, తెనాలి 12. పి. లలితా కుమారి, గుంటూరు 13. కె యస్. ఆర్. మూర్తి, హైదరాబాద్ 14. రవిశంకర్ కాజా, హైదరాబాద్ 15. పి యస్. నారాయణ, గుంటూరు 16. ఎల్. అశోక్ కుమార్, హైదరాబాద్ 17. ఎ.ఎన్.యస్. నాథ్, విశాఖపట్నం 18. టి. తాతారావు, హైదరాబాద్ 19. ఆర్. శ్రీరామ్, హైదరాబాద్ 20. కె. రామక్రిష్ణ, రాజమండ్రి 21. మాజేటి ప్రసాద్, గుంటూరు 22. ఐ. నాగ భూషనరావు, పూనా 23. ఎ. వి. సుబ్రమణ్యం, గార 24. ఎమ్. తిరుమలరావు, హైదరాబాద్ 25. ఎమ్. సుందరీబాయి, హైదరాబాద్ 26. ఐ వి. ఆర్. శర్మ, పూనా 27. పి. శ్యామలాదేవి, హైదరాబాద్.

పై 27 గురు ఆల్ కరెక్టు ఎంట్రీలు పంపారు. ఒక్కొక్కరికి రూ. 4-50 పై. చొప్పున పంచడమైనది.

నా తలిదండ్రుల్ని పీడించి కట్నంతీసుకు వెళ్ళాల్సిన దుస్థితిలోలేను," అంది కాస్త ఆవేశంగా

"కట్నం లేకుండా పెళ్ళాడడానికి నీ కోసం అంత విశాల హృదయుడెవడు కాచుకుకూర్చున్నాడే?" తల్లి వెటకారం చేసింది, నోరు విప్పి ఎప్పుడూ ఇంతింత పెద్ద మాటలనని కూతుర్ని వింతగా చూస్తూ

లోపల బెరుగ్గానే ఉన్నా స్వరూప్ మీది ప్రేమ ఇస్తున్న ధైర్యంతో అంది స్వప్న "నిజానికి కాచుకొనే ఉన్నాడమ్మా. అతడు ఈ ఊళ్ళోనే జూనియర్ ఇంజనీరుగా పనిచేస్తున్నాడు. తండ్రి నాగార్జునసాగర్‌లో ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు హోదా, ఐశ్వర్యం ఉన్నవాళ్ళు. మేం ప్రేమించుకొని పెళ్ళిచేసుకోడానికి నిశ్చయించుకొన్నాం. మీరు అశీర్వదిస్తే మీకు నా సమస్య తీరడమేకాదు, మీకు సహృదయుడైన అల్లుడు లభిస్తాడమ్మా!"

"మన వాళ్ళేనా?"

తల్లీ, తండ్రీ, అన్నా ఒకేసారి అడిగారు వాళ్ళ గొంతులో ఉత్కంఠ, భయం ముప్పిరిగొని వినిపించాయి.

"కాదు!" ఈ రెండక్షరాలు పలుకడానికి స్వప్న చాలా శక్తి కూడ దీసుకోవాల్సి వచ్చింది.

అంతే!

ప్రళయపు కెరటం విరుచుకుపడ్డట్టుగా అయింది భీభత్సమైన అరుపులు ప్రారంభమయ్యాయి.

కమలమ్మ శోకం తీసింది.

విశ్వేశ్వరయ్య నిప్పులు కక్కాడు

అపర్నాలు పలికే అన్నగారు ముఖం చిట్లించాడు.

మిగతా పిల్లలు స్వప్నని వింత మృగంలా చూశారు.

"మే మిచ్చేది ఆశీర్వాదం కాదే! సర్వనాశనం కమ్మని శపిస్తాం. నాలుగు డబ్బులు కళ్ళజూడగానే కులమతాన్ని మరిచిపోయేదానివ వయ్యావా? ఏదో కాస్త గొడవపెట్టి తరువాత వాళ్ళే చల్ల బడతారులే అని నువ్వనుకొంటున్నావేమో! అలాంటిది కలల్లో కూడా తలవకు. ప్రేమా గీమా అని మళ్ళీ అన్నావో నా శవం ఈ ఇంటిదూలానికి వేళాడడం చూస్తావు!" అన్నాడు విశ్వేశ్వరయ్య.

ఇంచుమించు ఇలాంటి మాటలే తిట్టిపోసింది కమలమ్మ. స్వప్న తన నిర్ణయం మార్చుకోకపోయేట్టయితే తన శవం పెరటి నూతిలో తేలుతుందని ఖచ్చితంగా చెప్పేసింది.

స్వరూప్‌ను పొందడం అంత సులభం కాదన్న సత్యం స్వప్నని కృంగదీయ సాగింది. మరునాడు బడికి సెలవు చీటీ పంపి ఇంట్లో ఉండిపోయింది.

చెల్లెలి పరిస్థితి జాలిగొలిపేదిగా ఉన్నా ఆమె అలాంటి ప్రేమ వ్యవహారంలో చిక్కపడడం హర్షించలేకపోయాడు పురుషోత్తం. హితవుచెప్పాడు."జీవితం

ఎవరితోనో ఒకరితో ముడివేసుకోవడం తప్పనిసరయినా, ఆ ముడి పెద్దల నిర్ణయంమీద ఆధారపడితేనే బాగుంటుంది, స్వప్నా!"

"సుజాతను నువ్వెలా చేసుకోవాలనుకొన్నావు, అన్నయ్యా?" విస్మయంగా అడిగింది స్వప్న.

"సుజాత మన కులం పిల్లే. బంధుత్వం ఉంది. అమ్మనీ, నాన్ననీ ఒప్పించడం పెద్ద కష్టమైన పనికాదు! ఈ సంబంధం చేసుకోవడంవల్ల వాళ్ళకు తలవంపులయ్యేదేమీ ఉండదు!"

"చదువుకున్న యువకులు కూడా కులం పట్టింపు పెట్టుకోవాలా? ఈ కాలంలో వర్ణ, మతాంతర వివాహాలు ఎన్ని జరగడంలేదు!"

"ఎన్ని జరిగినా అవి కొద్దివే! సంప్రదాయ పద్ధతిగా పెద్దలు జరిపే పెళ్ళిళ్ళముందు, ఫలానా అమ్మాయి, అబ్బాయి ప్రేమించుకొని కులాంతర వివాహం చేసుకొన్నారని వింటాంగాని, ఆ తరువాత వాళ్ళు ఆ వివాహంవల్ల పడే కష్టాలు, మనస్పర్ధలు, సమాజం బహూకరించే ఛీత్కారాలు, చిత్ర

ఏజెంట్లకు, పాఠకులకు గమనిక

శ్రీ సిద్ధార్థినామ సంవత్సర

యువ

దీపావళి సంచిక

ఈ దీపావళికి 'యువ' ప్రత్యేక సంచిక ఎక్కువ ఆకర్షణలతో పండుగకు ముందుగా వెలువడుచున్నది. ఏజెంట్లు తమ ఇండెంట్సును అగస్టు 15 వ తేదీలోగా తెలియజేయవలెను.

వెల : 8-00 రూపాయలు

నేడే మీ కాపీని రిజర్వు చేసుకోండి.

రిజిష్టరు పోస్టులో పంపగోరు వారు అదనంగా రూ. 2-50 పై. పంపవలెను.

పబ్లిషరు
యువ

హింసలు మనవాళ్ళా రావు। ఎవ్వరో వర్ణాంతర, మతాంతర వివాహం చేసుకొన్నారని వాళ్ళని ఆదర్శం చేసుకోవడం అభ్యుదయ మంటావా?" ఈ సమాజంలో రంకులూ బొంకులూ, దోపిడీలు, అవినీతి పనులు జరగడం సహజం, సర్వసాధారణమే అయినా మనం వాటిని ఆదర్శం చేసుకోగలమా? చెడ్డకి ఎంత మెజారిటీ, బలం ఉన్నా మనిషి దానికి దూరంగా ఉండాలనే కోరుకొంటాడు కదా?

"కులమతాలు పాటించడం సంకుచితం, సంఘ విద్రోహ చర్య అంటావా, కలిసిపోవడంలోనే సమాజ శ్రేయస్సు ఉంటుందని నే నడుగుతాను। మనుషులంతా ఒకటి కావడమనేది చాలా అసంభవం, స్వప్నా! కులవిభజన నువ్వు రూపుమాపదల్చుకొన్నా ఆర్థికంగా అంతస్తుపరంగా మనుషులమధ్య విభజన ఎప్పుడూ ఉండనే ఉంటుంది। ఎన్ని ఉపన్యాసాలు దంచినా, ఎన్ని ఉద్యమాలు లేవదీసినా ఈ హెచ్చుతగ్గులు ఎవరూ రూపుమాపలేరు।

"స్వరూప్‌ని చేసుకొని నీపాటికి నువ్వు సుఖంగా ఉండగలిగినా ఇక్కడ మా పరిస్థితి నువ్వు కొంచెంఆలోచించాలి। కుటుంబంలో ఒక్కరు తప్పుచేస్తే దాని శిక్ష కుటుంబమంతా అనుభవించాలి। నీ తరువాత ముగ్గురు ఆడపిల్లలున్నారు. వాళ్ళ అక్క కులంతక్కువవాణ్ణి కట్టుకొంటే వాళ్ళకు సంబంధాలు అంత తేలిగ్గా రావు। ప్రతిచోటా మమ్మల్ని వేలెత్తి చూపినట్టుగానే ఉంటుంది।

"మేం కట్నమిచ్చి పెళ్ళిచేయలేమన్న నిరాశతో నువ్వు స్వరూప్‌కి దగ్గరయి ఉంటే నేను నీకోసం కట్నం తీసుకొని నీకు పెళ్ళి జరిపిస్తాను స్వప్నా!"

అన్నగారి మాటలు పట్టుతాళ్ళతో కట్టివేయడంలా కనిపించింది స్వప్నకి. ఇవి పట్టుతాళ్ళయినా, ఇనుప సంకెళ్ళయినా వీటిని తెంచుకోలేదు. స్వరూప్‌ని చేరలేదు. వయసొచ్చాక ప్రతి ఆడపిల్లా పెళ్ళంటూ చేసుకొని పుట్టింటికి దూరం కావడం సహజమే అయినా ఆ దూరం తల్లిదండ్రుల గుండెలమీది బరువుదించేది కావాలిగాని గుండెలో నిప్పు పెట్టేది కాకూడదు।

3

సాయంత్రం బడి వదిలాక ఇంటికి వస్తున్నది స్వప్న, మధురతో. స్కూటర్ శబ్దం చెవినిబడుతూనే గుండెలు టక టక కొట్టుకోసాగాయి. మధుర చెయ్యి బిగించిపట్టుకొని వేగంగా నడవసాగింది స్వప్న.

స్కూటర్ దారికి అడ్డంగా నిలిపి నేలమీద ఓ కాలు అన్చి, అడిగాడు స్వరూప్, "మూడు రోజులనుండి బడికి రాలేదేం?"

జవాబివ్వకుండా స్కూటర్ని

తప్పించుకొని ముందుకు వెళ్ళసాగింది స్వప్న.

ఆమెను నాలుగడుగులు పోనిచ్చి మళ్ళీ స్కూటర్ ఆమెకు అడ్డంగా తీసికెళ్ళి ఆపాడు. "ఆరోగ్యం బాగా లేదా, స్వప్నా? ముఖం అలా వాడిపోయిందేమిటి?" ఆదుర్దాగా అడిగాడు.

"...." స్వప్న మధురచెయ్యి వదలకుండా ముందుకు వెళ్ళసాగింది.

ఆమెను పది అడుగులు ముందుకు పోనిచ్చి స్కూటర్ని ఆమె చుట్టూ ప్రదక్షిణం చేయించి దారికి అడ్డంగా ఆపాడు.

"రోడ్డుమీద ఇలా అల్లరిపెట్టడం ఏమిటి, మిస్టర్?" మధుర కోపంగా అడిగింది. "పోలీసుల్ని పిలువనా?"

మధుర స్వప్నకి ప్రాణంలాంటి స్నేహితురాలని తెలుసు స్వరూప్‌కి. మధుర మాటలకి కాస్త నొచ్చుకొని స్వప్న ముఖంలోకి ప్రశ్నార్థకంగా చూశాడు స్వరూప్. "అసలేం జరిగింది స్వప్నా? హఠాత్తుగా ఎందుకీ మార్పు? చెప్పకపోతే నాకెలా తెలుస్తుంది?" కలవరంగా అడిగాడు.

కదిలిస్తే చాలు జలజలరాలే వానకు తడిసిన చెట్టులా ఉంది స్వప్న పరిస్థితి. దుఃఖం గొంతును బిగబట్టేసింది.

మధుర చేతులు జోడించి ప్రార్థిస్తున్నట్టుగా అంది, "మీరు స్వప్నను మరిచిపోవాలి! మీరు వత్తిడిచేస్తే తను ఆత్మహత్య చేసుకు చచ్చిపోతుంది."

నెత్తిన పిడుగుపడినా అంతనిశ్చేష్టుడు అయ్యేవాడు కాదేమో! వెలవెలబారిన ముఖంతో "ఎందుకని?" అడిగాడు, హఠాత్తుగా తననెవరో పట్టుకొని 'నీకు ఉరిశిక్ష పడింది' అని అంటే ఎందుకని అడిగినట్టుగా.

"స్వప్న తలిదండ్రులు ఉత్త ఛాందసులు! మీ పెళ్ళి జరగడం చాలా అసంభవం! స్వప్న మిమ్మల్ని మరిచి పోకపోతే ఆమె తలిదండ్రుల శవాలు ఆ ఇంట్లోంచి లేస్తాయని వాళ్ళు స్పష్టంగా చెప్పేశారు. దయచేసి మీ ఇద్దరి మధ్య స్వప్నని నలుపకండి! స్వప్నని మరిచి పోండి!"

"నేనొకసారి వచ్చి వాళ్ళతో మాట్లాడనా?"

"వద్దు" జవాబు ఖచ్చితంగా స్వప్న నుండి వచ్చింది. "అలాంటి పిచ్చిపని ఎప్పుడూ చేయకండి. మా ఇంట్లో మీకు జరిగే అవమానానికి నేను ఆత్మహత్య చేసుకు చచ్చిపోతాను!"

ఈ మాట అనేసి తనకేసి కన్నెత్తి అయినా చూడకుండా మధుర చేయిపట్టుకొని చరచరా వెళ్ళిపోతున్న స్వప్నని ఖిన్నుడై చూడసాగాడు స్వరూప్.

స్వప్నది పిరికితనమా? నిర్లక్ష్యమా? ప్రేమించి, ప్రేమింపబడి ఇద్దరు కలిసి కట్టుకొన్న ప్రేమసౌధాన్ని కూల్చడానికి ఎలా సంకల్పించింది? / చదువుకొని

సంపాదిస్తూ కూడా ఒక వ్యక్తిత్వం ఏర్పరుచుకోలేదా ఈ దేశంలో ఆడపిల్ల?

మరునాడు స్వప్న బడిలో క్లాసు తీసుకొంటున్న సమయంలో ప్యూన్ ఒక కవరు తెచ్చి ఇచ్చింది. "స్కూటర్ మీద ఒకాయన వచ్చి ఇది మీకిమ్మని చెప్పాడమ్మా!"

స్వప్నకి ఆ కవరు చించాలనీ, చదవాలనీ లేదు. స్వరూప్ అందులో ఏం రాసి ఉంటాడో తనకు తెలుసు! 'స్వప్నా! ఎందుకిలా మారిపోయావ్?' అని గోలపెట్టి ఉంటాడు. 'మనం దూరం కావడానికి వీల్లేదు' అని అరిచి ఉంటాడు?

స్వప్న కవరు చించింది.

"స్వప్నా!

సాయంత్రం దేవీబాగ్‌కి రా! లేకపోతే నేనే మీ ఇంటికి వచ్చేస్తాను! నేను మీ ఇంటికి వస్తే నువ్వు ఆత్మహత్య చేసుకు చచ్చిపోతానన్నావు! మన ప్రేమ విఫలం కావడమే జరిగితే ముందు నా చావే నువు చూస్తావు!

—స్వరూప్."

చివరి వాక్యం బైంబాంబులా భయపెట్టకపోతే దేవీబాగ్‌కి ఎంతమాత్రం వెళ్ళేదికాదు స్వప్న. దేవీబాగ్‌లో స్వరూప్‌ని కలుసుకోవడమే జరిగితే తనేమైపోతుందో తనకే తెలియదు!

సాయంత్రం ఇంటికి వచ్చి ముఖం కడుక్కొని టీ తాగి మధురని తోడు తీసుకోకుండానే దేవీబాగ్‌కి బయల్దేరింది స్వప్న.

గుండెల్లో గుబులు పుట్టించే ఎరుపును పులుముకొంటున్న ఆకాశంకేసి చూస్తూ స్వప్నకోసం ఆదుర్దాగా నిరీక్షిస్తున్నాడు స్వరూప్ దేవీబాగ్‌లో.

స్వప్న వస్తుందో లేదో?

స్వప్నతో తన ప్రేమ వ్యవహారం జీవన్మరణ సమస్యలా ఉంది! ఈ కులం ఎక్కువ పిల్లను ప్రేమించి తన మనసునెంత చిత్రవధ పెట్టుకోవాల్సి వచ్చింది!

అతడి గుండె సుడిగుండంలో చిక్కుబడినట్టుగా, అగ్నిగుండంలో వేగుతున్నట్టుగా ఉంది! దాన్ని బయటికి లాగాలంటే స్వప్నకి తప్ప ఆ శక్తి లేదు ఎవరికీ.

అదిగో స్వప్న!

తనని ఆ సుడిగుండంలోకి మరింత లోతుగా తోసేసిపోతుందో?

అడుగులో అడుగు వేస్తూ నడిచివచ్చి తలవంచుకు నిలబడింది స్వప్న.

"స్వప్నా! మధుర టీచర్ చెప్పేదంతా నిజమేనా?"

స్వప్న కళ్ళనుండి జలజల రాలిన కన్నీళ్ళు, అదిరే పెదవులు, వణికే శరీరం స్వరూప్ ప్రశ్నకు జవాబిచ్చాయి!

"స్వప్నా!" పాతాళం అడుక్కి తలక్రిందులుగా జారిపోతున్నట్టుగా పిలిచాడు!

"నేను చివరి వీడ్కోలు తీసుకో డానికి వచ్చాను!" ఎలాగో గొంతు పెగల్చుకొని అంది.

"నువ్వింత పిరికిదానివా ?"

"పిరికిదాన్ని కాదు. బానిసని, ఖైదీని."

"ఎవరికి?"

"కన్యగా తలిదండ్రులకి. పెళ్ళయ్యాక భర్తకి. వయసు మళ్ళాక పిల్లలకి. తర తరాలుగా మా స్త్రీ జాతి ఇంతే. చదువు కొన్నా, సంపాదించుకోగలిగినా మాకు స్వంతంగా ఒక నిర్ణయం చేసుకోగల హక్కు లేదు. ఏ చట్టాలూ మా శృంఖ లాలు తెంచలేవు. ఏ ఉపన్యాసాలూ మమ్మల్ని మనుషులుగా నిలబెట్టలేవు."

"ఎందుకింత నిరాశ ? మీ అమ్మా నాన్నా చచ్చిపోతాం అని బెదిరించడం వల్లేనా ? అవి బెదిరింపులే! ఇలా బెదిరించినవాళ్ళు చచ్చిపోరు, స్వప్నా!"

"కాకపోయినా మా కుటుంబం నవ్వులపాలు అవుతుంది!"

"రెండు రోజులు ఒక విశేషంగా చెప్పుకొంటారు. తరువాత మామూలుగా కలిసిపోతారు! మీవాళ్ళు మొదట ఎంత తిట్టినా రక్తసంబంధాన్ని, మమతని అంత తేలిగ్గా తెంచివేసుకోలేరు!"

"నన్ను భ్రమలోకి, స్వార్థంలోకి లాగవద్దు, స్వరూప్! నిజంగా మీకంటే ఎక్కువ నరకం అనుభవిస్తున్నది నేను. అయినా మీనుండి దూరం కావడానికే నిశ్చయించుకొన్నాను. ఎందుకో తెలుసా ? కన్నవాళ్ళగుండెల్లో నిప్పులు గుమ్మరించి నేను మీ దగ్గర సుఖశాంతు లనుభవించలేను. మీ ప్రేమకు న్యాయం చేయలేను.

"కాలక్రమంలో నా తలిదండ్రులు నా తప్పును మరిచిపోయి నన్ను దగ్గరికి తీస్తారంటున్నారు కదూ? ఇదే కాలం నన్ను మీరు మరిచిపోయే శక్తిని ఇస్తుంది! ఇక నాకు సెలవు ఇస్తే వెళ్ళి పోతాను...."

చేతులు జోడించి నిలబడిన స్వప్న ముఖంలో కనిపించినవి కళ్ళు కావు! రెండు నిండు కోనేరులు!

జోడించిన ఆ రెండు చేతుల్ని తన చేతుల్లోకి ఆప్యాయంగా తీసుకొన్నాడు స్వరూప్. "స్వప్నా, నా కోసం నీ వాళ్ళని త్యాగం చెయ్యలేవా ?" రుద్ధంగా అడిగాడు.

"ప్రాణమైనా త్యాగం చేస్తాను మీ కోసం! కాని, ప్రాణంకంటే గొప్పది ధర్మమనేది. అది త్యాగం చేయలేనిది. చేశాక మనిషి బ్రతుకే విలువలేనిది.

"స్వరూప్! నన్ను మీ మాటలతో బలహీనురాలిని చేయవద్దు. మీ ప్రేమతో నన్ను వివశురాలిని చేయవద్దు! కరుణ చిప్పిల్లే ఈ కళ్ళతో నన్ను బంధించవద్దు. స్వరూప్, నన్ను వదిలి వే.. యం....డి!" స్వరూప్ చేతుల్లో ముఖం దాచుకొని ఏడవసాగింది.

మన ప్రేమకు గుర్తుగా ఏమైనా ఒకటి తీసుకోవాలనుకుంటున్నాను."

"ఏమిటి?"

స్వరూప్ స్వప్న నుదురు చుంబించి "ఇది మాత్రమే. వెళ్ళు, స్వప్నా! ఇంకెప్పుడూ నేను నీ కళ్ళబడనని నీకు హామీ యిస్తున్నాను," అన్నాడు. అని అక్కడ నిలువలేదు. గబగబా వెళ్ళి తన స్కూటర్ స్టార్ట్‌చేసి తిరిగి చూడకుండా వెళ్ళిపోయాడు.

గడ్డిలో కుప్పగా కూలిపోయి దయనీయంగా రోదించసాగింది స్వప్న.

అయిపోయింది.

ఇక్కడ పెంచుకున్న ప్రేమలతను తన చేతులతో ఇక్కడే ఛిన్నాభిన్నం చేసింది! ఈ చోటికి స్వరూప్‌ని వెతుక్కుంటూ తనెప్పుడూ రాదు! స్వరూప్ కూడా రాడు!

స్వరూప్ ఎప్పుడూ కూర్చునే ఆ చోటుని ఆప్యాయంగా తడిమింది స్వప్న.

4

ఆ గడియ వస్తే కళ్యాణం అదే అయిపోతుందన్న ఉదాశీనత్వం వదిలిపోయింది విశ్వేశ్వరయ్యకు. కూతురికి వెంటనే పెళ్ళిచేసి పంపేయాలని సంబంధాలకోసం కాళ్ళకు బలపాలు కట్టుకొన్నట్టుగా తిరగడం మొదలుపెట్టాడు. ఇదివరలో 'నా బిడ్డ బి.ఎ. చదివిందికదా? ఎమ్.ఎ.నో అంతకంటే ఎక్కువ చదివినవాడ కావాల అనవాడు. ఇప్పుడు అలాంటిదేం పెట్టుకోలేదు. సంప్రదాయస్తులై కూటికీ గుడ్డకీ లోపం లేకపోతే చాలన్నట్టుగా ఉన్నాడు.

ఏ సంబంధం తెచ్చినా వ్యతిరేకించే స్థితిలో లేదు స్వప్న. తల నరకడానికి ఏ కత్తి అయితేనేం అన్నట్టు జడత్వం దాల్చిందామె.

"నీ కూతురికి కట్నం డబ్బులు సంపాదించి పెట్టడానికే నన్ను కన్నావా" అని అడిగే పురుషోత్తం ఇప్పుడు ఏ సంబంధానికైనా, వాళ్ళనుండి ఎంత కట్నం పిండడానికైనా సిద్ధంగా ఉన్నాడు.

ఈ సంగతి తెలిసి సుజాతకి కంపరమెత్తింది. ఆమె పురుషోత్తంమీద అనురాగం పెంచుకొన్న మనిషి. అతడితో జీవితం పెనవేసుకోవాలని తాపత్రయపడుతున్న మనిషి.

ఒకరోజు దిగులుగా తండ్రికి చెప్పిందీ విషయం. "నాన్నా! పురుషోత్తానికి సంబంధాలు వస్తున్నాయట!"

"నిన్ను చేసుకొంటానని మాటిచ్చాడు కదమ్మా?"

"ఏమో? విన్న కలుసుకొని మాట్లాడాలని చూస్తే ముఖం తప్పించాడు."

"నేను కనుక్కుంటాలే అమ్మా!"

ఆరోజే వెళ్ళి విశ్వేశ్వరయ్యను కదిలించాడు శీనయ్య

(సశేషం)

Printed and Published by A. Chandrasekar Rao at 5-9-88 Public Garden Road Hyderabad-500001, for YUVA Publications and Printed at Dolton Press, Public Garden Road, Hyderabad-500 001 Editor: A. SUDHAKARA RAO